క్లుప్తంగా

ఎమ్మెల్సీ కారు తనిఖీ


తనిఖీ చేస్తున్న అధికారులు

నర్సాపూర్: నర్సాపూర్ చెక్‌పోస్టు వద్ద సోమవారం ఎమ్మెల్సీ శేరిసుభాష్‌రెడ్డి కారును చెక్‌పోస్టు అధికారులు తనిఖీ చేశారు. పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా నర్సాపూర్ హైదరాబాద్ జాతీయ రహదారిపై చెక్‌పోస్టు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఏఈ అర్వింద్, పోలీసులు కిషన్, సురేశ్‌నాయక్, ప్రవీణ్ తదితరులు తనిఖీ చేశారు.

ఉచిత వైద్య శిబిరం


పరీక్షలు చేస్తున్న డాక్టర్లు

చేగుంట(తూప్రాన్): మెడిసిటి ఆస్పత్రి ఆధ్వర్యంలో సోమవారం రాంపూర్ గ్రామంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా మెడిసిటి డాక్టర్లు గ్రామస్తులకు పలు ఆరోగ్య సమస్యలపై పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను అందించారు. 104 మందికి పరీక్షలు నిర్వహించి 25 మందికి పలు సమస్యలపై శస్త్ర చికిత్సలు అవసరమని గుర్తించారు. వారికి త్వరలోనే ఉచిత ఆపరేషన్‌లు చేయనున్నట్లు వైద్యులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మెడిసిటి వైద్యులు ఇంతియాజ్, జాహ్నవి, దివిజ సిబ్బంది కుమారస్వామి, నాగార్జున, పూజలతో పాటు గ్రామ నాయకులు పాల్గొన్నారు.

మరిన్ని సేవా కార్యక్రమాలు విస్తరిస్తాం: సెహగల్


అభివృద్ధి పనులను అప్పగిస్తున్న దృశ్యం

శివ్వంపేట(నర్సాపూర్): గ్రామాల్లో సెహగల్ సంస్థ ఆధ్వర్యంలో మరిన్ని సేవా కార్యక్రమాలు విస్తరిస్తామని సెహగల్ సంస్థ ఫౌండర్ జై సెహగల్ అన్నారు. మండల పరిధిలోని పిల్లుట్ల గ్రామంలో రూ.90 లక్షల నిధులతో చేపట్టిన వివిధ పనులను గ్రామ పంచాయతీకి సోమవారం అప్పగించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాలను అభివృద్ధి చేయాలనే సంకల్పంతో పాటు, స్వయం ఉపాధి అవకాశాలు పెంచేందుకు కృషి చేస్తున్నట్లు చెప్పారు. అందులో భాగంగా పిల్లుట్ల గ్రామంలో సోలార్ వీధి లైట్లు, రైతులకు పనిముట్లు, చెరువు, కుంటల అభివృద్ధి పనులు చేసినట్లు తెలిపారు. ఈ అవకాశాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు రవి, సులోచన నర్సింహరెడ్డి, సెహగల్ సంస్థ సిబ్బంది సురిసి సింగ్, నవనీత్, సలావుద్దీన్, వేమనారాయణ, గ్రామస్తులు ఉన్నారు.

మైనార్టీలకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం


ఇఫ్తార్ విందులో కాంగ్రెస్ నాయకులు

పెద్దశంకరంపేట(మెదక్): మైనార్టీలకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం ఉంటుందని ఉమ్మడి జిల్లా ప్రణాళిక సంఘం మాజీ సభ్యులు నగేశ్ షెట్కార్, టీపీసీసీ నాయకులు చంద్రశేఖర్‌రెడ్డి, టీపీసీసీ సభ్యులు కర్నె శ్రీనివాస్‌లు అన్నారు. సోమవారం రాత్రి పెద్దశంకరంపేటలో నిర్వహించిన ఇఫ్తార్ విందులో వారు పాల్గొన్నారు. అన్ని వర్గాల అభ్యున్నతికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందని వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండలాధ్యక్షుడు రాయిని మధు, సీనియర్ నాయకులు నారాగౌడ్, ఆర్ఎన్.సంతోష్, గంగారెడ్డి, మాజీ ఎంపీపీ బాసాడ రాజు, విఠల్, మైనార్టీ నాయకులు సలీం, జహంగీర్, జావిద్, మినాజ్, షఫీ, యాదుల్, రఫీఖ్, సిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

సైబర్ మోసాలపై అప్రమత్తత

గజ్వేల్‌రూరల్: విద్యార్థులు సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలని సీఐ సైదా చెప్పారు. ధర్మారెడ్డిపల్లిలో కొనసాగుతున్న ఎన్ఎస్ఎస్ శిబిరంలో వలంటీర్లకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. సెల్‌ఫోన్‌లకు వచ్చే ఓటీపీ, పాస్‌వర్డ్‌లను అపరిచితులకు చెప్ప వద్దని సూచించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ క్యాంపు ఇన్‌చార్జి భాస్కర్‌రెడ్డి, హెడ్ కానిస్టేబుల్ సంజీవరెడ్డి పాల్గొన్నారు.

స్వయం ఉపాధి వైపు చూపు

వాడిన పూలతో అగర్‌బత్తీల తయారీ • సహకారం అందించిన స్వచ్ఛంద సంస్థ


అగర్‌బత్తీలను తయారు చేస్తున్న మహిళలు


విక్రయానికి సిద్ధంగా ఉన్న అగర్‌బత్తీలు

శివ్వంపేట(నర్సాపూర్): స్వయం ఉపాధితో ఎదగాలనే లక్ష్యానికి స్వచ్ఛంద సంస్థ తోడ్పాటుతో మహిళలు ముందడుగు వేశారు. అనుకున్న లక్ష్యం వైపు వెళ్లాలనే సంకల్పంతో అగర్‌బత్తీల తయారీకి ముందుకు వచ్చారు. మండల పరిధిలోని ఏదుల్లాపూర్ గ్రామానికి చెందిన బురెడ్డి చిన్న పద్మ, బురెడ్డి పెద్ద పద్మ, లావణ్య, కల్పన గ్రూపుగా ఏర్పడి నెల రోజుల క్రితం అయోధ్య రామ అగర్‌బత్తీల తయారీని ప్రారంభించారు.

స్వచ్ఛంద సంస్థల సహకారం

అగర్బత్తీల తయారీ కోసం మహిళలకు ఆర్థిక సాయం చేసేందుకు సెగల్ స్వచ్ఛంద సంస్థ ముందుకు వచ్చారు. లక్ష యాభై వేల ఆర్థిక సాయం చేయడంతో అగర్‌బత్తీల తయారీకి కావాల్సిన సామగ్రి, ముడిసరుకులు సమకూర్చుకున్నారు. మరో లక్ష ఇరవై వేలు పోగుచేసుకొని యంత్రాలు కొనుగోలు చేశారు. అగర్‌బత్తీల తయారీకి యంత్రాల నిర్వాహకులు మహిళలకు గ్రామంలోనే శిక్షణ ఇచ్చారు. వివిధ ఆలయాల్లో వాడేసిన పూలను సేకరించి వాటిని ఎండబెట్టి పొడి చేసి ప్రకృతిసిద్ధంగా అగర్‌బత్తీల తయారీ ప్రారంభించారు. తయారు చేసిన అగర్‌బత్తీలను మార్కెటింగ్ చేసేందుకు సిద్ధంగా ఉంచారు. చిన్న గ్రామంలో మహిళలు ముందుకు వచ్చి స్వయం ఉపాధి పొందేందుకు చేస్తున్న కృషి పలువురికి ఆదర్శంగా నిలిచారు.

కెమికల్ పదార్థాలు లేకుండా..



కెమికల్ పదార్థాలు వాడకుండా ఆలయాల వద్ద వాడేసిన పూలను సేకరించి అగర్‌బత్తీల తయారీ చేస్తున్నాం. సరైన మార్కెట్ అవగాహన లేనందున వాటి అమ్మకాల కోసం అయోమయంలో ఉన్నాం. అధికారులు మార్కెట్ సదుపాయం కల్పిస్తే ఆర్థికంగా రాణించే అవకాశం ఉంది.

\- బురెడ్డి పద్మ

మహిళలు ఆర్థికంగా బలపడాలి



మహిళలు ఆర్థికంగా బలపడాలనే లక్ష్యంతో వారికి సంస్థ నుంచి తోడ్పాటు అందించాం. స్వయం ఉపాధిలో రాణించాలనుకునే మహిళ సంఘాలకు సాయం అందజేస్తాం.

\- వేమనారాయణ, సెగల్ స్వచ్ఛంద సంస్థ ప్రాజెక్ట్ లీడర్

బీజేపీ నాయకుల ఇంటింటి ప్రచారం


ప్రచారం నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు

నర్సాపూర్ రూరల్: పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి రఘునందన్‌రావుకు ఓటేసి గెలిపించాలని బీజేపీ నాయకులు వాల్దాస్ మల్లేశ్‌గౌడ్, నారాయణరెడ్డి అన్నారు. మండలంలోని తుజాల్‌పూర్, తిరుమలాపూర్ గ్రామాల్లో సోమవారం వారు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. నరేంద్ర మోదీని గెలిపించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు అరవింద్ గౌడ్, గణేశ్, యాదగిరి, గోవర్దన్, శేఖర్, మహేశ్, వెంకట్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మినీ రైస్‌మిల్ మిషన్ అందజేత


మినీ రైస్‌మిల్ మిషన్ అందిస్తున్న శృచిసింగ్

చేగుంట(తూప్రాన్): సెహగల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సోమవారం కిష్టాపూర్ మహిళా రైతులకు మినీ రైస్‌మిల్ మిషన్‌ను అందజేశారు. ఈ సందర్భంగా సీనియర్ ప్రోగ్రాం లీడ్ శృచిసింగ్ మాట్లాడుతూ.. మహిళా రైతులు ఒక సంఘంగా ఉండి మినీ రైస్‌మిల్‌ను నిర్వహించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ప్రతినిధులు మారుతీ, నవనీత్, సలావుద్దీన్, సునీల్, బాలరాజ్, మహిళా రైతులు ఉన్నారు.

సీసీ రోడ్డుకు క్యూరింగ్ చేయరా?


నర్సాపూర్‌లో క్యూరింగ్‌కు నోచుకోని సీసీరోడ్డు

నర్సాపూర్: మున్సిపాలిటీ పరిధిలోని 13వ వార్డులో ఇటీవల సీసీరోడ్డు వేసి క్యూరింగ్ చేయలేదు. రోడ్డు ఏర్పాటు చేసిన అనంతరం పర్యవేక్షణ లేకపోవడంతో కాంట్రాక్టరు క్యూరింగ్ చేయకపోయినా అధికారులు మాత్రం స్పందించడం లేదని విమర్శలు వస్తున్నాయి. సీసీ రోడ్డుకు క్యూరింగ్ చేస్తేనే చాలా కాలం పాటు మన్నికతో ఉంటుందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై మున్సిపల్ కమిషనర్ జైత్‌రాం నాయక్‌ను వివరణ కోరగా.. తమ సిబ్బందిని పంపి పరిశీలించడంతో పాటు క్యూరింగ్ చేసేలా చర్యలు తీసుకుంటానని చెప్పారు.

నర్సంపల్లిలో భూగర్భజలాల పెంపుకు చర్యలు


అవగాహన కల్పిస్తున్న ఏఈఓ విజృంభన

చిన్నశంకరంపేట(మెదక్): నార్సింగి మండలంలోని నర్సంపల్లి పెద్ద తండాలో భూగర్భజలాల పెంపుకు తీసుకోవాల్సిన చర్యలపై వ్యవసాయ అధికారి విజృంభన అవగాహన కల్పించారు. సోమవారం నర్సంపల్లి పెద్దతండాలో రైతులకు భూగర్భ జలాలు తగ్గిపోవడానికి కారణాలను, పెంపుకు తీసుకోవాల్సిన చర్యలు వివరించారు. ఎక్కడపడితే అక్కడ నీరు వృథా చేయడంతో పాటు చెరువులు, కుంటు నిండకుండా కాల్వలు దెబ్బతీయడంతో నీటి వనరుల కొరత ఏర్పడిందన్నారు. పర్యావరణ రక్షణకు రక్షించాల్సిన చెట్లను తొలగించడంతో సమస్య వచ్చిందన్నారు. ఇక ముందు బోర్ల వద్ద ఇంకుడు గుంతలు, నీటికుంటలు, కందకాలు, ఏర్పాటు చేసుకోవాలని సూచించారు.

ఎట్టకేలకు పంటలకు వదిలిన సాగునీరు

- శాలిపేట రైతుల పంటలకు నష్టం లేకుండా జాగ్రత్తలు
- చెన్నాయిపల్లి రైతుల పంటలకు సాగునీరు


నీరు వదులుతున్న ఇరిగేషన్ సిబ్బంది

చిన్నశంకరంపేట(మెదక్): చెన్నాయిపల్లి రైతుల పంటలకు అవసరమైన సాగునీరు అందించేందుకు అధికారులు చేసిన ఫలితాలు ఫలించాయి. సోమవారం మండలంలోని శాలిపేట గ్రామంలో రైతులతో రామాయంపేట సీఐ వెంకటేశం, ఇరిగేషన్ ఏఈ ప్రదీప్‌రెడ్డి, తహసీల్దార్ మన్నన్ ఆధ్వర్యంలో చర్చలు జరిపారు. శాలిపేట రైతుల పంటలకు ఎలాంటి నష్టం జరగకుండా కాల్వలను తీసి సాగునీరు తీసుకెళ్లాల్సిన బాధ్యత చెన్నాయిపల్లి రైతులు, ఇరిగేషన్ వర్కర్స్ తీసుకుంటే నీళ్లు వదిలేందుకు తమకేమి అభ్యంతరం లేదని శాలిపేట రైతులు ఒప్పుకున్నారు. దీంతో చెన్నాయిపల్లి రైతులు శాలిపేట నల్లచెరువు నుంచి కాల్వను బాగుచేశారు. అధికారుల సమక్షంలో మధ్యాహ్నం తర్వాత సాగునీరును వదిలారు. మూడు రోజులుగా అధికారులు చేసిన ప్రయత్నాలు పలించి చెన్నాయిపల్లి రైతుల పంటలకు సాగునీరు అందించడంతో సమస్య పరిష్కారమైంది.

ఆరుతడి పంటల రక్షణకు పాట్లు


ట్యాంకర్ ద్వారా పంటకు నీరందిస్తున్న రైతు

శివ్వంపేట(నర్సాపూర్): భూగర్భ జలాలు అడుగంటి పోతుండడంతో పంటల పరిరక్షణకు రైతులు పాట్లు పడుతున్నారు. మండల పరిధిలోని ఏదుల్లాపూర్ గ్రామానికి చెందిన బురెడ్డి వెంకట్‌రెడ్డి చెందిన బోరుబావిలో నీటిమట్టం తగ్గిపోవడంతో 20 గుంటల్లో వేసిన ఆరుతడి పంటలను కాపాడుకునేందుకు సదరు రైతు ట్యాంకర్ ద్వారా నీటిని తెచ్చి నీరందిస్తున్నాడు.

శ్మశాన వాటిక స్థలం కాపాడాలి


వినతిపత్రం అందిస్తున్న గ్రామస్తులు

నర్సాపూర్: మండలంలోని కాగజ్‌మద్దూర్ గ్రామంలోని మాల కులస్తులకు చెందిన శ్మశాన వాటిక స్థలాన్ని ఆక్రమణల నుంచి కాపాడి అధికారికంగా కేటాయించాని గ్రామస్తులు ఆర్డీఓ జగదీశ్వర్‌రెడ్డిని సోమవారం కోరారు. సీపీఎం నర్సాపూర్ డివిజన్ కార్యదర్శి నాగరాజు ఆధ్వర్యంలో గ్రామానికి చెందిన మాల కులస్తులు కృష్ణ, సాలయ్య, కుమార్, లక్ష్మయ్య, శోభ, సువర్ణ, యశోద, దేవరాజు, మల్లేశ్, కుమార్ తదితరులు ఆర్డీఓకు తమ సమస్యను వివరించి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. దశాబ్దాల నుంచి మాల కులస్తులు చనిపోయిన వారి సమాధులు గ్రామంలో 61 తదితర సర్వే నంబర్లలోని భూమిలో పెడుతున్నారని చెప్పారు. కొందరు వ్యక్తులు శ్మశాన వాటిక భూమిని ఆక్రమించారని వారు ఆవేదన వ్యక్తం చేస్తూ తమ శ్మశాన వాటిక భూమిని కాపాడుతూ హక్కు పత్రం ఇవ్వాలని కోరారు. ఆర్డీఓ జగదీశ్వర్‌రెడ్డి స్పందిస్తూ తాను పరిశీలించి న్యాయం చేస్తానని వారికి హామీ ఇచ్చారు.

మాజీ ఉపసర్పంచ్‌పై దాడి అమానుషం


నిరసన తెలుపుతున్న నాయకులు

మెదక్ కలెక్టరేట్: నిజాంపేట మాజీ ఉప సర్పంచ్‌పై దాడి చేయడం అమానుషమని, దుండగులను వెంటనే అరెస్ట్ చేయాలని దళిత సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్ వద్ద నిరసన తెలిపి అదనపు కలెక్టర్ వేంకటేశ్వర్లకు వినతి పత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. మండల కేంద్రంలో రియల్ ఎస్టేట్ వ్యాపారులు కొందరు మార్చి 27న మాజీ ఉపసర్పంచ్ కొమ్మాట బాబుపై దాడి చేశారని తెలిపారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా.. ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు చెప్పారు. అయినప్పటికీ నిందితులను అరెస్టు చేయకపోవడం దారుణమని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు బాల్‌రాజ్, కల్లూరి సంజీవ, శ్రీనివాస్, దుర్గపతి, ప్రసాద్, సిద్దిరాములు, శ్రీనివాస్, బాల్‌రాజ్, శివ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు

చిలప్‌చెడ్(నర్సాపూర్): మండల పరిధిలోని జగ్గంపేట గ్రామంలో విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా సోమవారం గ్రామంలో పునఃనిర్మించిన హనుమాన్ ఆలయంలో ఆంజనేయుడు, శివపంచాయతన(శివలింగం, అమ్మవారు, గణపతి, విష్ణుమూర్తి, సూర్యుడు), నాగదేవత విగ్రహాలతో పాటు ధ్వజస్తంభం ప్రతిష్ఠించారు. ఈ ఉత్సవాలకు హాజరైన ఎమ్మెల్యే సునీతారెడ్డి ఆంజనేయస్వామిని దర్శించుకొని, ప్రత్యేక పూజలు జరిపించారు. కార్యక్రమంలో ఎంపీపీ వినోదరెడ్డి, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు అశోక్‌రెడ్డి, ఉపాధ్యక్షులు లక్ష్మణ్, వీరాస్వామి, సొసైటీ వైస్ చైర్మన్ రాంచంద్రారెడ్డి, గ్రామ మాజీ సర్పంచ్ మాంతప్ప, యూత్ నాయకుడు రాజేందర్‌రెడ్డి, నాయకులు దుర్గారెడ్డి, భీమయ్య, పోచయ్య, ముకుందరెడ్డి, భక్తులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

బోనాల ఊరేగింపు


బోనాల ఊరేగింపులో భక్తులు

నర్సాపూర్‌రూరల్: మండలంలోని తుజాల్‌పూర్ గ్రామంలో మల్లికార్జున స్వామి ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా సోమవారం స్వామివారి కల్యాణం, బోనాల ఊరేగింపు, అగ్నిగుండాలు నిర్వహించారు. ఉదయం భక్తులు ఉదయం ఒడి బియ్యం, దుస్తులను సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.

తాగు నీటి సమస్య రాకుండా చూడాలి

నర్సాపూర్: గ్రామాల్లో తాగునీటి సమస్య రాకుండా సక్రమంగా నీటి సరఫరా చేయాలని ఎంపీడీఓ మధులత సూచించారు. సోమవారం తన కార్యాలయంలో మండలంలోని పంచాయతీ కార్యదర్శులతో ఆమె సమీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ.. వేసవి కాలాన్ని దృష్టిలో పెట్టుకొని నీటి సరఫరా సక్రమంగా జరిగేలా చూడాలని అన్నారు. నీటి సరఫరాలో ఏమైనా సమస్యలు తలెత్తితే వెంటనే వాటిని పరిష్కరించి ప్రజలకు నీటి సమస్య రాకుండా చూడాలని సూచించారు. సమావేశంలో ఎంపీఓ శ్రీనివాస్ పాల్గొన్నారు.

నీటి ఎద్దడి నివారణ చర్యలు

సాక్షి ఎఫెక్ట్


సీతారాం గిరిజనులతో మాట్లాడుతున్న ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ కిషన్

కొల్చారం(నర్సాపూర్): మండలంలోని సీతారాం తండా, సంగాయిపేట తండాలో తాగునీటి ఎద్దడిపై సోమవారం 'సాక్షి'లో ప్రచురితమైన గ్రామాల్లో తాగునీటి ఎద్దడి వార్తపై అధికారులు స్పందించారు. ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ కిషన్ సోమవారం తండాలను సందర్శించి నీటి సమస్యపై ఆరా తీశారు. సీతారాం తండాకు వెళ్లే మిషన్ భగీరథ పైప్‌లైన్ మరమ్మతులు చేయించే పనులకు ఆదేశించారు. అవసరమైతే రెండు బోరు మోటార్లను అద్దెకు తీసుకునేందుకు తండావాసులతో మాట్లాడారు. సంగాయిపేట తండాలో నీటి ఎద్దడి నివారణకు అక్కడ సింగిల్ ఫేస్ మోటర్‌ను అందుబాటులోకి తీసుకురావాలని, ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేయాలని పంచాయతీ అధికారులను ఆదేశించారు. ఆయన వెంట ఎంపీడీఓ లక్ష్మీనర్సింలు, పంచాయతీ కార్యదర్శులు, మిషన్ భగీరథ సిబ్బంది ఉన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ **బీబీపాటిల్‌ను ఓడించాలి**

అల్లాదుర్గం(మెదక్): జహీరాబాద్ ఎంపీగా రెండుసార్లు గెలుపొందిన బీబీ పాటిల్ ఏలాంటి అభివృద్ధి చేయలేదని, పార్టీ మారి మళ్లీ ప్రజలను మోసం చేయడానికి చూస్తున్న ఆయన్ను ఓడించాలని కాంగ్రెస్ ఎస్సీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు బల్‌రాం అన్నారు. సోమవారం బల్‌రాం మాట్లాడుతూ.. పదేళ్లుగా ఎంపీగా ఉన్న బీబీపాటిల్ నియోజకవర్గంలో అభివృద్ధి కనిపించలేదన్నారు. ఎన్నికలు రావడంతో ప్రచారం కోసం వస్తున్నారని విమర్శించారు.

◆ **తాగునీటి ఎద్దడి రానివ్వద్దు**



శివ్వంపేట(నర్సాపూర్): గ్రామాల్లో తాగునీటి ఇబ్బందులు రానివ్వకుండా చూడాల్సిన బాధ్యత సిబ్బందిపై ఉందని ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ కిషన్, ఎంపీడీఓ నాగేశ్వర్‌గుప్తా అన్నారు. సోమవారం ఎంపీడీఓ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వేసవికాలం దృష్టిలో పెట్టుకొని నీటి ఎద్దడి తలెత్తకుండా పనిచేయాలన్నారు. పైప్‌లైన్ లీకేజీలతో పాటు ఇతర సమస్యలు నెలకొంటే వెంటనే వాటి పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. మిషన్ భగీరథ నీరు వృథాగా పోకుండా చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ తిరుపతిరెడ్డి, ఈఓ లక్ష్మీప్రసాద్ తదితరులు ఉన్నారు.

◆ **పెద్దమ్మ ఆలయ నిర్మాణానికి భూమిపూజ**

మనోహరాబాద్(తూప్రాన్): మండలంలోని దండుపల్లి గ్రామంలో పెద్దమ్మ ఆలయ నిర్మాణానికి సోమవారం భూమిపూజ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మాజీ ఫుడ్ కార్పొరేషన్ చైర్మన్ ఎలక్షన్‌రెడ్డి హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో శ్రీరాములు పంతులు, మాజీ ఎంపీటీసీ కృష్ణగౌడ్, నాయకులు భిక్షపతి, రాజు, వెంకటేశ్, సోములు, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

◆ **గ్రామ దేవతల విగ్రహ ప్రతిష్ఠలు**

చేగుంట(తూప్రాన్): మండలంలోని పలు గ్రామాల్లో నిర్వహించిన విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాల్లో కాంగ్రెస్ దుబ్బాక నియోజకవర్గ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి హాజరయ్యారు. వల్లభాపూర్ గ్రామంలో మల్లన్న విగ్రహ ప్రతిష్ఠ, రుక్మాపూర్‌లో పెద్దమ్మ విగ్రహప్రతిష్ఠ, చందాయిపేటలో పోచమ్మ విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాల్లో పాల్గొని దైవ దర్శనం చేసుకున్నారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. ఆలయాల అభివృద్ధి కోసం నిధులు అందిస్తానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో చేగుంట, నార్సింగి మండల అధ్యక్షులు నవీన్‌కుమార్, శ్రీనివాస్‌గౌడ్, నాయకులు శ్రీకాంత్‌తో పాటు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

◆ **వైభవంగా బీరప్ప కల్యాణోత్సవం**

పెద్దశంకరంపేట(మెదక్): మండల పరిధిలోని చీలాపల్లిలో బీరప్పస్వామి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. సోమవారం ఆలయ ఆవరణలో బీరప్ప కామరతి కల్యాణం అంగరంగ వైభవంగా జరిగింది. వేదపండితుల మంత్రోచ్ఛరణల మధ్య కల్యాణాన్ని నిర్వహించారు. అనంతరం నిర్వాహకులు అన్నదానం ఏర్పాటు చేశారు.

◆ **ఘనంగా పెద్దమ్మ విగ్రహ ప్రతిష్ఠ**

చేగుంట(తూప్రాన్): మండలంలోని రుక్మాపూర్ గ్రామంలో పెద్దమ్మ విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సోమవారం ఆలయంలో యంత్ర, విగ్రహ ప్రతిష్ఠను నిర్వహించి హోమం చేశారు. ఈ సందర్భంగా ఆలయ నిర్మాణం కోసం సహకరించిన దాతలకు సన్మానించారు. ఈ కార్యక్రమంలో సహకార సంఘం చైర్మన్ మ్యాకల పరమేశ్, నాయకులు గాండ్ల ఆనందం, మోహన్, రాంచంద్రం, సత్యం, రాఘవ, నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

◆ **ఘనంగా వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవం**

పాపన్నపేట(మెదక్): మండలంలోని అన్నారం గ్రామంలోని వేంకటేశ్వర ఆలయంలో సోమ వారం స్వామివారి కల్యాణం ఘనంగా నిర్వ హించారు. ఆలయ అష్ట వార్షికోత్సవంతో పాటు పద్మావతి సహిత వేంకటేశ్వరస్వామి, పార్వతీ పరమేశ్వరుల కల్యాణోత్సవం భక్తిశ్రద్ధలతో జరిపారు.

